కథ

# సెలక్షన్

◆ తొత్తడి గణపతిరావు ◆

**అది ఆ సిటీలోకెల్లా పేరు మోసిన పెద్ద బట్టల షాపు. షాపును చూసి భుజాలెగరేస్తూ మెట్లెక్కుతున్నాడు శ్రీధర్.**

ఇంత పెద్ద బట్టల షాపుకు డోర్ తీసేందుకు కనీసం ఓ జవాన్ కూడా లేడే అని డోర్ తీసేందుకు చెయ్యి ముందుకు చాచబోతుండగానే ఆటోమేటిక్‌గా గ్లాస్ డోర్ తెరుచుకుంది. వైట్ డ్రస్‌లో జిగేల్మంటూ ఓ వ్యక్తి వచ్చి "వెలకమ్ సర్. వాట్ డు యు వాంట్ టు టేక్... షర్టింగ్స్, పాంటింగ్స్, సూటింగ్స్" అడిగాడు.

"నో... నో... ఐ వాంట్ వన్ సారీ..." కూలింగ్ గ్లాసెస్ తీసి చుట్టూ పరికిస్తూ అన్నాడు శ్రీధర్. షాపంతా ఏసి... చల్లగా, హాయిగా వుంది.

"వెరీ గుడ్ సార్... ఆ... విమలా ఈయన్ని సారీ సెక్షన్‌కు తీసుకెళ్ళు."

"బట్ ఒన్ థింగ్ మిస్టర్"

"టెల్ మీ సార్."

"సెలక్షను నాకంతగా తెలియదు. ఆ బాధ్యత కూడా తీసుకునే ఓ మంచి గాళ్‌ను... ఐ మీన్ సేల్సుగాళ్‌ను చూపించండి."

"ఓకే... ఓకే... ఆ ప్రమీల... సుధ... రోజా... నో... మిస్ ధరణీ యిలారా..."

"మిస్ ధరణీ... తనలో తనే గొణుక్కున్నాడు శ్రీధర్. స్వీట్ నేమ్... ఇంతలో ధరణీ వచ్చి నిల్చుంది... 'స్వీట్ ఫిగర్ టూ' ధరణిని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూస్తూ అనుకున్నాడు.

"చూడు ధరణీ సారీ సెక్షన్ తీసుకెళ్ళి సారీస్ చూపించి సెలక్షన్‌లో కాస్త సాయం చెయ్యి. హి హేజ్ నో అయిడియా ఎబౌట్ సారీ సెలక్షన్" చెప్పాడు వైట్‌డ్రస్.

"అలాగే సార్... కమ్ విత్‌మీ సర్" కదిలింది ధరణి ఆశ్చర్యంగా చుట్టూ చూడ్డం మొదలెట్టాడు శ్రీధర్.

అతను తనతో రాథవం లేదని గమనించి వెనక్కి తిరిగి రండి సార్ వెళదాం... ఏమిటలా ఆగిపోయి చూస్తున్నారు."

"మీ షాపులో కోకిలలున్నాయా అని."

"అంటే..." ఆలోచనగా అడిగింది ధరణి.

"ఏం లేదు లెండి... మొదటిసారిగా విన్నప్పుడు కోకిల కూసిందేమోననుకున్నాను... అది మీ స్వరమే..."

◆◆◆

**'స్వీట్ ఫిగర్ టూ' ధరణిని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూస్తూ అనుకున్నాడు.**

◆◆◆

తీక్షణంగా చూసింది ధరణి. అంతలోనే యిలాంటి కోపతాపాలు తమ వృత్తికి పనికి రావని "మీరు బలేగే మాట్లాడుతారు సార్. రండి సారీస్ చూద్దురుగాని అంటూ హాంగర్స్‌కున్న సారీ తియ్యబోతూ అతన్నొక్కసారి పరికించింది.

వైట్ ఫ్యాంటు మీద రెడ్ షర్ట్ టక్ చేసాడు. హిందీ ఏక్టరులా మీసాలు తీసేసాడు... చక్కటి షేవింగ్ నున్నగా... ఆపిల్ రంగులో బుగ్గలు... 'అబ్బ మగవాళ్ళకు కూడా ఇలాంటి బుగ్గలుంటాయా, ఇంత స్మూత్‌గా' అనుకుంటూ నవ్వుకుందామె లోలోన.

"ఇంతకీ మీకే రెంజ్‌లో కావాలి సార్... ఐ మీన్ రేటు"

"రేటుదేముందండి? చీర బాగుంటే చాలు" ఆమె వంపు సొంపుల్ని పరిశీలిస్తూ అన్నాడతను.

"అదేమిటి రేటును బట్టీ చీరలు కూడా రెండొందల సాదా చీరెకు పన్నెండొందల బిన్నీ సిల్కు చీరకు తేడా లేదా? దాని అందం ముందు దీని అందంది దిగదుడుపే కదా!"

"నో... అలా అంటే నేనొప్పుకోను... మీరు కట్టుకున్న చీర ఖరీదెంత?"

సడెన్‌గా అతన్నుంచి వచ్చిన ఈ ప్రశ్నకు తడబడింది ధరణి. "రెండొందలు" కొంచెం

సిగ్గు పడుతూ చెప్పింది.

"అవునా... మరి... బహుశా ఈ చీర ఏ నాలుగో అయిదో వందలు కావచ్చు... కాని నాకు మీరు కట్టుకున్న చీరే బాగుంది" గుట్టగా పడి వున్న చీరల్లోంచి ఓ చీర తీసి మళ్ళీ పడేస్తూ అన్నాడు శ్రీధర్.

"ఎనీహౌ... ఆడవాళ్ళు చీర ఖరీదును బట్టి అందాన్ని అంచనా వేస్తారన్పిస్తుంది. మీరు చెప్పినట్లుగాగానే ఆ బిన్నీ సిల్కు చీరలే చూపించండి."

చురుగ్గా చూసింది ధరణి. ఏమిటితని ఉద్దేశ్యం. తను కట్టుకున్న చీర బావుందం టాడు. తన గొంతు బావుందంటాడు. నా ఉద్దేశ్యం ప్రకారం బిన్నీ చీర కొంటానంటాడు. ఇంతకు ముందు కూడా కష్టమర్స్ వెకిలిగా తాగేసినట్టు చూడ్డం చీరలు చూపించినప్పుడు చేతి వేళ్ళు తగిలించడం లాంటి వెధవ పనులు చెయ్యడం తనకు అనుభవమే... కాని ఇతను మరీ కొత్తగా ప్రవర్తిస్తున్నాడు.

రాక్‌లోంచి పది చీరలు తీసి పడేస్తూ, "చూడండి సార్ ఆల్ లేటేస్ట్ కలర్స్."

అతను చీరల వైపు చూడటం లేదు. పసిమి ఛాయలో మెరిసిపోతున్న ఆమె ఫాల భాగంలో వెలిగిపోతున్న బ్లూకలర్ ప్లాస్టిక్ బొట్టును పరిశీలిస్తున్నాడు.

"సార్ మీరు చీరలు చూడ్డం లేదు."

"ఆ పని నాది కాదని నేను ముందే చెప్పే మిమ్మల్ని సెలక్టు చేసుకున్నాను" చిన్నగా నవ్వుతూ అన్నాడు శ్రీధర్.

"అయితే ఇలా తినేసినట్లు చూడ్డమేనేమో మీ పని" అని మనసులో విసుక్కుంటూ... "సరే... ఇంతకూ మీ మిసెస్ ఎలా వుంటారో చెబితే..."

"వాట్ డు యు మీన్... మీ ఉద్దేశ్యం అప్పుడే నాకు పెళ్ళయిపోయిందనా... లేక పోతే కాలేదని కన్‌ఫర్మ్ చేసుకోవడానికి అలా అడిగారా..." మెల్లిగా ఆమె ఒక్కదానికే వినిపించేలా చెవి దగ్గర అన్నాడు.

ధరణికి మండిపోయింది. ముఖం కంద గడ్డలా ఎరుపెక్కింది. అయినా కంట్రోల్ చేసుకుంటూ "ఎవరికో ఎలా వుంటారో చెప్పక పోతే ఎలా కుదురుతుంది" కోపంగా అంది.

"మీరేమీ అనుకోనంటే... మీలాగే ఉంటారనుకుని సెలక్టు చెయ్యండి."

లాభం లేదు. ఇది న్యూ లూజు కేసే... గొడవ పడి లాభం లేదు. తొందరగా వదుల్చుకోవడమే మంచిదని నిర్ణయించుకుని ఇది చూడండి సార్ చాలా బావుంటుంది అని ఓ చీర చూపించింది.

"గాఢమైన ఎరుపురంగు... పెద్ద పెద్ద పూలు..."

"ఏదీ ఒక్కసారి కట్టుకుని... ఐ మీన్,,, జస్ట్... ఎగ్జిబిట్ చేసి చూపించండి."

"తుండు గుడ్డ మీద వేసుకున్నట్టు భుజం మీద వేసుకుంది ధరణి... చిన్నగా నవ్వుతూ 'కలకత్తా కాళిలా వున్నారు...' అన్నాడు శ్రీధర్.

మీరు కోపంతో ఏదో ఒకటి చూపిస్తున్నారు.... పీడ వదుల్చుకుందామని... కైండ్లీ కోపరేట్ విత్‌మీ. నేను తీసుకెళ్ళిన చీర కట్టుకునే వాళ్ళకు నచ్చొద్దూ" ప్రాధేయత నిండిన స్వరంతో అన్నాడతను.

కొంచెం వేడి తగ్గింది ధరణికి... "ఇది చూడండి..." పసుపు రంగు చీర తీసింది.

"నో... ఈ రంగూ ముదురుగానే వుంది... తర్వాత ఆ పూలు చూసారా... మరీ భూతాల్లా అంతేసి ఎందుకు... కొంచెం లైట్ కలర్‌లో... చిన్న చిన్న పూలు... అందంగా..."

ఈయనకి సెలక్షన్ తెలియదని ఎవరన్నారు... చంపేస్తున్నాడు మనసులోనే అనుకుంటూ మరో పది చీరలు తెచ్చింది.

"లాభం లేదు. మీరు నాకు పెద్దగా సహకరించడం లేదు. టైం అవుతుంది. ఇక నా స్వశక్తినే నమ్ముకుంటాను. నేనే సెలక్టు చేసుకుంటాను అంటూ గుట్టలోంచి ఓ చీర తీశాడు. మేఘం రంగు బ్యాక్‌గ్రౌండ్‌లో నీలి... పసుపు రంగులు కలిసిన చిన్ని చిన్ని పూలు.

"బ్యూటిఫుల్ సెలక్షన్" తన్మయంగా బైటికి అనేసింది ధరణి.

"నిజంగానా.. లేకపోతే త్వరగా వదిలించుకుందామనా" నవ్వుతూ అడిగాడు శ్రీధర్... నవ్వి నప్పుడు ఆ పెదవి విరుపులో... మంచి అందముంది... అనుకుంది ధరణి.


"నిజం సార్... చాలా మంచి సెలక్షన్..."

"అయితే... ఒక్కసారి... సారీ... విప్పి... ఎగ్జిబిట్ చేసి చూపించండి."

కోపంగా చూసింది ధరణి అతని వైపు... చిన్నపిల్లాడి ముఖంలా అమాయకంగా స్వచ్ఛంగా ఉందతని ముఖం. అతని మాటలకు వేరే అర్థాలు తనే ఊహించుకుందేమో! తల దించుకుని చీర మడత విప్పి... కుచ్చిళ్ళు పెడుతూ... ఓ చెంగు పైటలా వేసుకుంటూ మోడల్‌గా నిల్చుని ఎగ్జిబిట్ చేసింది ధరణి.

శ్రీధర్ జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు... అజంతా శిల్పంలా ధరణి.. ఆమె వంటి మీద పరచుకున్న ఆనందంతో చీర మురిసిపోతుంది. బ్యూటిఫుల్... ఇంతలో... నొసలు చిట్లిస్తూ... ఒక్క నిమిషం... అంటూ గబగబా వెళ్ళి పైటగా వేసుకున్న చీర అంచును సరిచేశాడు శ్రీధర్.... ఆమె గుండెల ఎత్తులపై అతని వేలు కొసల స్పర్శ... సుతిమెత్తగా... ఒక్కసారి


ఏదో విద్యుత్తు ప్రవహించినట్లు... షాక్‌లా... చుట్టూ చూస్తున్నారేమో భయం... ఎవరేమనుకుంటారో... బిడియం "యూ" అసంకల్పిత



ఆడవాళ్ళు చీర ఖరీదును బట్టి అందాన్ని అంచనా వేస్తారన్పిస్తుంది.

కథ

## వీళ్ళ చూపుల్ని ప్రశ్నల్ని ఎలా తట్టుకోవాలి? ఏం సమాధానం చెప్పాలి?



ప్రతీకార చర్యలా ధరణి బుస్సుమంది.. అతని చంప ఛెళ్ళుమంది. అంత ఒక్కసారి అటు తిరిగారు... "ఏమయింది? ఏమయింది?" అంటూ.

షాపంతా కలవరం.

"మంచి పని జరిగింది. వెధవ్వేషాలేస్తే అంతే మరి" ఓ ఆడగొంతు.

"ఆ ముందే పరిచయమూ లేకపోతే అంత ముందుకెళ్తాడా? ఎక్కడో బేరం కుదరలేదు" ఓ శృంగార పురుషుడి వెకిలి వ్యాఖ్యానం.

"ఏమైంది?" అంటూ హడావుడిగా వచ్చాడు మేనేజర్.

"ఛ... తను తొందరపడింది. ఇప్పుడీ సిట్యువేషన్ ఎలా ఎదుర్కోవాలి? అందరూ తననే చూస్తున్నారు. వీళ్ళ చూపుల్ని ప్రశ్నల్ని ఎలా తట్టుకోవాలి? ఏం సమాధానం చెప్పాలి?" అని ధరణి ఆలోచిస్తుంది.

"అయామ్ సారీ... చిన్న పొరపాటు... పొరపాటు నాదే... క్షమించండి. ఆ చీర ప్యాక్ చెయ్యించండి" చకచకా నడుచుకుంటూ క్యాష్ కౌంటర్ వైపు కదిలాడు శ్రీధర్.

❁❁❁

ధరణి బస్సు దిగుతూ వెనక డోర్ నుంచి దిగుతున్న వ్యక్తిని చూసి "అమ్మో" అనుకుంది ధరణి... ఉదయం షాపులో చెంప దెబ్బ తిన్న వ్యక్తి... ఎందుకిలా వెంబడిస్తున్నాడు. మొదట అదోలా ప్రవర్తించినా ఆఖరికి సారీ చెప్పినప్పుడు నిజంగా పశ్చాత్తాప పడుతున్నాడనుకుంది. కాని ఇదేమిటిలా వెంటబడుతున్నాడు... కొంపదీసి పగ తీర్చుకోవడానికి కాదు కదా!

జన సంచారం లేదు. కేకవేస్తే ఎవరైనా సహాయం చెయ్యకపోతారా? హు... ఇది మహానగరం... నగరం నడిబొడ్డులో మర్డర్ జరిగినా పట్టించుకోని జనం ఈ మారుమూల తను అరిచి గోలపెట్టినా ఆదుకుంటారనే నమ్మకం లేదు. తన నెవరైనా ఆదుకుంటారనే నమ్మకం కంటే అతన్నే బ్రతిమాలుకుంటే కనికరం చూపించకపోడు అనుకుంది ధరణి.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది. భూజాన ఎయిర్ బ్యాగ్ చేతిలో చీర ప్యాకెట్. ఉదయం తను చూపించిన చీరే అయివుంటుంది. ఒక్కసారిగా ధరణి వెనక్కి తిరిగి అతని వైపు నడచి రావడంతో ఆగిపోయాడతను.

"సార్. ఏదో ఆవేశంలో తొందపడ్డాను. క్షమించండి. మగదిక్కులేని సంసారం మాది. మీరు ఇంట్లో చొరబడ్డా యిదేమిటని అడిగే దిక్కులేని వాళ్ళం. మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి... క్షమించి వదిలెయ్యండి..." నుడిగుండాల్లా కళ్ళలో నీరు తిరిగింది. తన పరిస్థితికి తనే జాలి పడుతూ అంది ధరణి.

• శ్రీధర్‌కు మనసు కలుక్కుమంది... అలా ఆమెను దగ్గరకు తీసుకొని... బాధ పడకు ధరణి.. నీకు నేనున్నాను" అంటూ గుండెలకు హత్తుకోవాలన్పించింది.

"అయామ్ సారీ... మీరు బాధపడకండి. తప్పు చేసింది నేను. మీరు బాధ పడటం సారీ చెప్పడం ఎందుకు? అసలు మీకు కన్పించకుండా ముందుగానే వెళ్ళిపోదామనుకున్నాను కాని అమ్మ ఇచ్చిన అడ్రసు పారేసుకున్నాను. అందుకని మిమ్మల్ని ఫాలో కాక తప్పలేదు."

"ఏమిటీ మీరు మాట్లాడేది?"

"తెలుగే... నేను భారతమ్మ గారింటికి వెళ్ళాలి... పి. భారతమ్మ."

"ఆవిడ మీకేమవుతారు."

"మీరు కోప్పడనంటే చెబుతాను... అత్తయ్య"

"అంటే... మీరు..." ధరణి కళ్ళల్లో కొత్త మెరుపు... బుగ్గల్లో సిగ్గుల దోబూచులు...

"శ్రీధర్... ఫ్రమ్ బెంగుళూర్..."

ధరణి... కళ్ళు యింత చేసుకుని చూసింది శ్రీధర్‌ని. ఉదయం తల్లితో జరిగిన సంభాషణ గుర్తుకొచ్చింది.

"నువ్వు ఇవాళ్ళైనా కాస్త తొందరగా ఇంటికొచ్చెయ్యవే... మీ బావ వస్తున్నాడు."

"ఆ... ఎందుకట... ఇన్నాళ్ళకు గుర్తుకొచ్చామా వాళ్ళకు. ఆఖరికి నాన్నగార్ని పోగొట్టుకున్న కష్టంలో కూడా కనిపించని వాళ్ళకు ఇప్పుడు కనిపించామా?"

"అలా నిష్టూరాలాడకే తల్లీ... ఇందులో వాళ్ళ తప్పేంలేదు. కులమూ గోత్రమూ లేనివాడ్ని చేసుకుందని మీ అత్తయ్యని నానా మాటలాడి మీ నాన్న గారే ఇంటి నించి తరిమేశారు. చుట్టపు చూపుగా ఓసారి వచ్చినా మెడపట్టి బైటికి గెంటినంత పని చేశారు. అప్పటి నుంచి మన రెండు కుటుంబాల మధ్య దూరం పెరిగినా... రాకపోకలు లేకపోయినా మీ అత్తయ్య మాత్రం నాకు ఉత్తరాలు రాస్తుంది. రహస్యంగానే నేను అందుకుంటూనే ఉన్నాను. మీ అత్తా బావ చాలా మంచివాళ్ళు.

"ఓహో..." అనేసింది ధరణి... ఎందుకంటే ఆ కుటుంబాలు విడిపోయే నరికి ధరణి వయస్సు

మూడు సంవత్సరాలు... ఇక ఆమెకేం తెలుస్తుంది... అత్త బావ మంచితనం.

అంటే అమ్మ చెప్పిన బావ... ఆ అత్తకొడుకు... బెంగుళూరు బావ...

"ఏమిటండీ... ఉలుకూ పలుకూ లేకుండా పోయారు. నమ్మకం కుదరడం లేదా?"

"అక్కర్లేదు. మరి ఈ విషయం ముందరే చెప్పొచ్చుగా... ఇంటికి రాకుండా అక్కడికి వచ్చి నన్ను ఇబ్బంది పెట్టడంలో ఉద్దేశ్యం."

"సరదాగా సర్‌ప్రైజింగ్‌గా... నువ్వు పని చేస్తున్న షాపులో... నువ్వు సెలక్టు చేసిన చీరనే కొని నీకు ప్రెజెంట్ చేసి సర్‌ప్రైజ్ చేద్దామనుకొన్నాను. అసలు చీర కొనేసి ఇంటి కొచ్చేద్దామనుకున్నాను. కాని అమ్మ ఇచ్చిన అడ్రసు కాగితం పోగొట్టుకోవడంతో... ఇంకొక్క విషయం ధరణీ... షాపులో... నా ప్రవర్తన... నిజంగా అనుకోకుండా జరిగి పోయింది... సరదాలు ఎగతాలి... మాటల వరకేగాని... అలా ప్రవర్తించడం... నాకే బాధగా అన్పించింది" సిగ్గు పడుతూ అన్నాడతను. అతని సిన్సియారిటీకి చలించిపోయింది ధరణి.

ఇల్లు సమీపించింది.

ముందుగా సిగ్గుల మొగ్గవుతూ కూతురు వెనుక సినిమా హీరోలా వున్న ఆరడుగుల అందగాడు కల్సి రావడంతో సందిగ్ధంలో పడింది భారతమ్మ.

గారాభంగా ఎదురు వెళ్ళి... బాబూ! నువ్వు....

"బావ... బెంగుళూరు బావ.." సిగ్గుగా అంటూ తుర్రమంది ధరణి.

"అదేమిటి బాబూ! పది గంటల ట్రైనుకు వస్తావని వ్రాసింది అమ్మ."

"వచ్చానండి... కాని... ఊర్లో చిన్న పనుండి..." తలుపు చాటు నుండి కిసుక్కున నవ్వింది ధరణి.

ఇంతలో ఆరేళ్ళ తార... ధరణి చెల్లెలు అక్కడికొస్తూ... "బావా ఈ ప్యాకెట్ నాకేనా!" అని అడిగింది శ్రీధర్ చేతిలోని చీర ప్యాకెట్ పట్టుకుంటూ.

"ఆ బాక్సు నీకే... లోపలి చీర మాత్రం... మీ అక్కకు... అమ్మ పంపింది..." అంటూ భారతమ్మ చేతిలో పెట్టాడు.

"ధరణీ... ఇదుగో ఈ ప్యాకెట్ తీసుకో అని ధరణికందిస్తూ నీకా బాక్స్ అక్క ఉదయం ఇస్తుందిలే అని సర్ది చెప్పింది. బాక్స్ కోసం గొడవ చేస్తున్న తారతో భారతమ్మ.

తెల్లవారింది.



# బుర్రకథ చరిత్ర



రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైన ప్రపంచమంతా ఫాసిస్టుల ప్రళయ ఆర్భాటాలతో మారుమ్రోగింది.

భారతదేశపు తూర్పుకోస్తా అంతా ప్రమాద స్థితిలో పడిపోయింది. ఆంధ్ర ప్రజలు అరచేతిలో ప్రాణాలు బిగపట్టుకుని బ్రతకవల్సి వచ్చింది. ఈ తీవ్ర సంచలన పరిస్థితిలో ప్రతీ కళాకారుడు దేశభక్తి ప్రపూరితుడైపోయాడు. కవులు గేయాలు వ్రాశారు. గాయకులు కంఠా లెత్తారు. ఆంధ్రప్రజా సామాన్యమంతా గాఢ నిద్రలో మేల్కొలిపారు. నాడు దేశంలో వచ్చిన రాజకీయ కల్లోల వాతావరణంలో ఏర్పడిందే ప్రజానాట్యమండలి ఉత్సాహం కొద్దీ నిర్మించింది కాదు. ప్రజా నాట్యమండలి అది ఒక ఉధృత వాతావరణంలో జన్మించింది.

కళ కళ కోసం కాదనీ అది ప్రజల కోసమని నిరూపించింది. కళ వ్యక్తుల సొత్తు అని ఎవ్వరు అనరు. అది ప్రజల సొత్తు అని చాటింది. ప్రాచీన కళారూపాలన్నింటినీ ఉద్ధరించారు.

కళారూపానికి అనేక విధానాల మెరుగు పరిచారు. ఒక్కొక్క కళారూపానికి ఒక్కొక్క ప్రజా సమస్యను ముడిపెట్టారు.

అలా మనకున్న ప్రాచీన జానపద కళారూపాల్లో ప్రప్రథమంగా ప్రారంభించినదే బుర్రకథ.

ప్రస్తుత పరిస్థితిలో మరుగునపడిన బుర్ర కథలను వెలుగులోకి తీసుకువచ్చి కళాకారులను ఆదుకోవల్సిన బాధ్యతను ప్రభుత్వం, అభిమానులు గుర్తించాలని ప్రముఖ బుర్ర కథకులు శ్రీ అగ్రహారపు కృష్ణ మయూరితో అన్నారు.

- ధరణీప్రగడ సత్యమూర్తి


**2 గంటల్లో ప్రభావాన్ని చూపే శక్తివంతమైన అద్భుత ఉంగరం**

మీరిక నిరుత్సాహ పడనవసరం లేదు. గ్రహాలననుసరించి తగిన బలవత్తర శుభముహూర్తంలో తయారు చేయబడిన ఈ ఉంగరాన్ని ధరించినా లేదా చెంత ఉంచుకున్నా వారెంతటి పాషాణ హృదయులైన వ్యక్తి అయినా మీ వశులవుతారు. పరీక్షల్లో నెగ్గుతారు. వ్యాపారంలో లాభం, కోర్టు కేసుల్లో విజయం, ఇష్టానుసారం వివాహం, సంతానప్రాప్తి, ఉద్యోగంలో ఉన్నతి మొదలైనవి సిద్ధిస్తాయి. మరియు అన్నిరకాల సమస్యల నుండి విముక్తులవుతారు. సర్వదా మేలు జరుగుతుంది. అష్టధాతువులతో తయారు చేయబడిన ప్రత్యేక తాంత్రిక ఉంగరం ఖరీదు రూ. 31/- మీ పేరు మరియు రాశి ఫలాన్ని అనుసరించి తయారుచేయబడే 2 గంటల్లోగా ప్రభావాన్ని చూపే అద్భుత సిల్వరీ సికంద్రీ ఉంగరం ఖరీదు రూ. 101/- ప్యాకింగ్ మరియు పోస్టేజి ఛార్జీలు అదనం. ఆకర్షణీయమైన ఉంగరం రూ. 251/- ప్రత్యేక శక్తివంతమైన డైమండ్ ఉంగరం 475/- గమనిక— ఫలితం లేనట్లయితే రెట్టింపు ధర చెల్లించబడుతుంది. ఇది మోసమని నిరూపించిన వారికి రూ. 11001/- బహుమతి ఇవ్వబడుతుంది. ఒకసారి పరీక్షించి చూడండి. వాస్తవం మీకే తెలుస్తుంది. ప్రత్యేక శక్తివంతమైన బంగారు ఉంగరం రూ. 275/- ఇది మీ పని విజయవంతం కావటానికీ, మీ లక్ష్యసాధనకు ఎంతగానో ఉపకరిస్తుంది. ఫలితం లేనట్లయితే మీ డబ్బు వాపస్ ఇవ్వబడుతుంది. వి.పి.పి. ద్వారా తెప్పించుకునే చిరునామా:

ADD: TIRUPATI ASHRAM (H/94)
P.O. LAL BIGHA (GAYA) –8